మోడీ గుప్పెట్లో మీడియా

- రాజకీయాల్లో ఎంట్రీ వరకే వారసత్వం
- మన సమర్థతే మనల్ని నిలబెడుతుంది
- మీడియాలో పనిచేసేవారి ధైర్యం గొప్పది : మంత్రి కేటీఆర్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో మోడీ మాయగా మీడియా మారిందని మంత్రి కెటిఆర్ అన్నారు. జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ డిపార్టుమెంట్, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో "తెలంగాణలో మీడియా, గతం, వర్తమానం, భవిష్యత్తు" అంశంపై హైదరాబాద్‌లోని అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో రెండ్రోజుల జాతీయ సెమినార్‌ను రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, గంట చక్రపాణితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. దేశంలో అత్యధిక అక్రిడిటేషన్ కార్డులు మన రాష్ట్రంలోనే ఇచ్చామని చెప్పారు. వారసత్వం అనేది ఎంట్రీ కార్డు మాత్రమేనని.. తరువాత మన సమర్థతే మనల్ని ప్రజల్లో నిలబెడుతుందని అన్నారు.

సిరిసిల్లలో నాలుగుసార్లు తాను ఎన్నికయితే ప్రతిసారీ పెరిగిన మెజార్టీయే దీనికి నిదర్శనమని చెప్పారు. తనకు రోజుకి 13 వార్తా పత్రికలు చదవడం అలవాటన్నారు. ఒక్కో వార్త ఒక్కో రకంగా వస్తుందని.. వాటిలో ఏది వాస్తవమో తెలుసుకోడానికి ఎక్కువ పత్రికలు చదవాల్సి వస్తున్నదని చెప్పారు. మీడియా సంస్థల కంటే కూడా మీడియాలో పని చేసే వారి ధైర్యం గొప్పదన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, టీఆర్ఎస్ పార్టీ పెట్టిన సమయంలో తమకు ఆర్థిక సపోర్ట్, మీడియా సపోర్ట్ లేకున్నా.. తెలంగాణ ప్రాంత పాత్రికేయులు తాము ఉన్నామని ధైర్యం ఇచ్చారని చెప్పారు.


ఎనిదేళ్లుగా ప్రధాని నరేంద్ర మోడీ మన్ కీ బాత్ తప్ప మీడియాతో మాట్లాడిన సందర్భం లేదన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నం అవుతున్నా, ద్రవ్యోల్బణం అతలాకుతలం చేస్తున్నా, దేశంలో నిరుద్యోగం పెరుగుతున్నా వార్తలు రావు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఏం తినాలి, ఏం వేసుకోవాలి అని చెప్పే అధికారం ప్రభుత్వాలకు ఎక్కడిదని ప్రశ్నించారు. ఇలాంటి వాటిని మీడియా నిలదీయదన్నారు. పక్క దేశంలో మోడీ ఒత్తిడి చేసి మరీ అదానికి ఓ కాంట్రాక్ట్ ఇప్పించారని సాక్షాత్తు ఆ దేశ మంత్రి చెప్పినా మన దేశ మీడియా దానిపై పరిశోధన చేసి వార్తలు రాయడం లేదన్నారు. మోడీ అంటే మీడియా యాజమాన్యాలకు అంత భయంగా ఉందని ప్రస్తావించారు.

మీడియా అకాడెమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనన్ని జర్నలిస్టు సంక్షేమ కార్యక్రమాలు తెలంగాణలో మాత్రమే అమలవుతున్నాయని తెలిపారు. కరోనా సమయంలో ఇబ్బందులు పడ్డ పాత్రికేయులను ఆదుకున్నామని, మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు పెన్షన్ ఇస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కె.సీతారామారావు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అభ్యసించే పాత్రికేయులు వందల సంఖ్యలో ఉండడం గర్వకారణంగా ఉందన్నారు. విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి దేశంలో మీడియా పాత్ర, మీడియా సంస్థలు వ్యవహరిస్తున్న తీరును వివరించారు.

విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని, అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయస్సును ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా పెంచాలని మంత్రి దృష్టికి తెచ్చారు. 'తెలంగాణలో మీడియా, గతం, వర్తమానం, భవిష్యత్' అంశంపై అంతర్జాతీయ జర్నలిస్ట్ ఎస్ వెంకట్‌నారాయణ కీలకోపన్యాసం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పత్రికలు కాస్త గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్నాయని, టివి ఛానెల్స్ పూర్తి స్థాయిలో ప్రజలను ఆకట్టుకోలేకపోతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.వి.ఎన్.రెడ్డి, విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యులు, టి-శాట్ సిఇఒ ఆర్.శైలేష్ రెడ్డి, సామాజిక శాస్త్రాల డీన్ ప్రొఫెసర్ వడ్దానం శ్రీనివాస్ ప్రసంగించారు.

చేర్యాలలో రిలయన్స్ 'ట్రెండ్స్' ఏర్పాటు

హైదరాబాద్ : ప్రముఖ అప్పారెల్, యాక్సరీస్ ప్రత్యేక చెయిన్ రిలయన్స్ 'ట్రెండ్స్' సిద్దిపేట జిల్లాలోని చేర్యాల పట్టణంలో తన నూతన స్టోర్‌ను తెరిచినట్లు ప్రకటించింది. దీన్ని 3813 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. వినియోగదారుల అభిరుచికి తగిన విధంగా అందుబాటు ధరలో, తాము చెల్లించిన ధరకు అత్యధిక విలువని కలిగి ఉంటుందని ఆ సంస్థ తెలిపింది. ప్రారంభోత్సవపు ఆఫర్ కింద రూ.3499 షాపింగ్ చేస్తే రూ.199లకే ఉత్తేజభరితమైన బహుమతి పొందవచ్చని పేర్కొంది.



రెసోనెన్స్ కళాశాలలో 'రెసోఫెస్ట్' ఉత్సవం

హైదరాబాద్ : జెఇఇ, ఇతర ప్రవేశ పరీక్షల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చే రెసోనెన్స్ హైదరాబాద్ శనివారం గచ్చిబౌలి స్టేడియంలో ఆ కాలేజ్ ఫెస్టివల్ 'రెసోఫెస్ట్'ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు టిఎస్ఆర్‌టిసి ఎండి విసి సజ్జనార్, నటుడు అడవి శేష్, జియో తెలంగాణ సిఇఒ కెసి రెడ్డి, రిసోనెన్స్ - హైదరాబాద్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు ఎన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి స్టేడియంలో ఘనంగా జరిగిన రిసోఫెస్ట్ ఉత్సవంలో నగరంలోని వివిధ క్యాంపస్‌ల నుండి వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులు ఆకర్షణీయమైన పలు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనతో సందడి చేశారు. విద్యార్థులలోని కళాకారులు తమలో సహజసిద్ధంగా ఉన్న ప్రతిభను ప్రదర్శించి ప్రేక్షకులను అలరించేందుకు ఈ సందర్భాన్ని ఉపయోగించుకున్నారు.

మరో 134 పోస్టుల భర్తీకి అనుమతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాఠశాల విద్యా సంచాలకుల పరిధిలో 134 పోస్టుల భర్తీకి రాష్ట్ర ఆర్థికశాఖ అనుమతించింది.

ఈ మేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పోస్టులను టిఎస్‌పిఎస్‌సి ద్వారా భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు.



రోగుల పునరుజ్జీవంపై వర్క్‌షాప్

- ఎస్ఎల్‌జి హాస్పిటల్స్ నిర్వహణ

హైదరాబాద్ : ఇండియన్ సొసైటీ ఆఫ్ క్రిటికల్ కేర్ మెడిసిన్ (ఐఎస్‌సిసిఎం)తో కలిసి ఈ నెల 12, 13 తేదీల్లో రోగుల పునరుజ్జీవనంపై వైద్యుల కోసం వర్క్‌షాప్ నిర్వహిస్తోంది. శనివారం ఈ వర్క్‌షాప్‌ను న్యూఢిల్లీలోని సాఫ్ దర్ జంఘ్ హాస్పిటల్ మాజీ మెడికల్ సూపరింటెండ్ డాక్టర్ వినోద్ డోగ్రా లాంఛనంగా ప్రారంభించారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రోగి శారీరక సంబంధమైన ప్రక్రియలను సక్రమంగా చేయడమే పునరుజ్జీవనంగా పేర్కొనవచ్చని డోగ్రా అన్నారు. ఎమర్జెన్సీ రూములో అడ్మిట్ అయిన సమయంలోనే కాకుండా ఇతర సందర్భాల్లో రోగి పునరుజ్జీవనం కోసం చేయవలసిన చర్యలపై ఈ వర్క్‌షాప్ ప్రధానంగా దష్టి కేంద్రీకరించిందని ఆ వర్గాలు తెలిపాయి. శరీరంలోని వివిధ భాగాలకు ప్రాణాపాయ ముప్పు కలిగిన సందర్భాలు, నిపుణుల అనుభవాల ఆధారంగా పునరుజ్జీవన నైపుణ్యాలు నేర్చుకోవడం, రోగిపై ప్రత్యేక శ్రద్ధ వహించడం, అత్యుత్తమ వైద్యారోగ్య ఫలితాలను రాబట్టడంపై ఈ వర్క్ షాప్ ఉద్దేశించబడిందని పేర్కొన్నాయి.. ఈ వర్క్ షాప్‌కు ఎస్ఎల్‌జి హాస్పిటల్స్ సిఎండి దండు శివరామరాజు, డైరెక్టర్ డివిఎస్ సోమరాజు, సిఇఒ గౌరవ్ ఖురానా సహా ఇతర సీనియర్ డాక్టర్లు హాజరయ్యారు.

ఇంటర్ ఫీజు చెల్లింపు గడువు 30

- ఆలస్య రుసుంతో డిసెంబర్ 22 వరకు అవకాశం
- ఇంటర్ బోర్డు వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2023 మార్చిలో జరిగే వార్షిక పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు ఈ నెల 30వ తేదీ వరకు ఉంది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫీజు చెల్లింపు ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ (జనరల్, ఒకేషనల్) రెగ్యులర్, ఫెయిలైన విద్యార్థులతోపాటు హాజరు మినహాయింపు ఉన్న ప్రయివేటు విద్యార్థులు సైతం ఫీజు చెల్లించాలని కోరారు. ఆలస్య రుసుం రూ.100తో డిసెంబర్ రెండు నుంచి ఆరు వరకు, రూ.500తో ఎనిమిది నుంచి 12 వరకు, రూ.వెయ్యితో వచ్చే నెల 14 నుంచి 17 వరకు, రూ.రెండు వేలతో అదేనెల 19 నుంచి 22వ తేదీ వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశముందని పేర్కొన్నారు. ఇంటర్ ఫస్టియర్ థియరీ సబ్జెక్టులకు జనరల్ విద్యార్థులకు రూ.500, ఒకేషనల్ విద్యార్థులకు రూ.710 (థియరీకి రూ.500, ప్రాక్టికల్స్‌కు రూ.210) చెల్లించాలని వివరించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు థియరీ సబ్జెక్టులకు రూ.500, సైన్స్ విద్యార్థులు రూ.710 (థియరీకి రూ.500, ప్రాక్టికల్స్‌కు రూ.210) ఫీజు చెల్లించాలని తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులు రూ.710 (థియరీకి రూ.500, ప్రాక్టికల్స్‌కు రూ.210) చెల్లించాలని పేర్కొన్నారు. హాజరు మినహాయింపుతో ప్రయివేటుగా రాసే ఆర్ట్స్, హ్యుమానిటీస్ విద్యార్థులు ఈనెల 30 వరకు రూ.500 చెల్లించాలని కోరారు. ఆలస్య రుసుం రూ.200తో డిసెంబర్ 12 వరకు గడువుందని తెలిపారు. ఇతర వివరాలకు tsbie.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో...

నేడు చక్కెర వ్యాధి ఉచిత స్క్రీనింగ్ క్యాంపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ డయాబెటిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చక్కెర వ్యాధి ఉచిత స్క్రీనింగ్ క్యాంపును నిర్వహిస్తున్నట్టు తల్లి, పిల్లల ఆరోగ్య కన్సల్టెంట్ డాక్టర్ టి.నళిని తెలిపారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మధుమేహం దీర్ఘకాలికమైన వ్యాధి అని, రక్తంలోని గ్లూకోజ్ స్థాయి పెరిగినప్పుడు ఈ సమస్య వస్తుందని తెలిపారు. 2025 నాటికి దేశవ్యాప్తంగా డయాబెటిక్ రోగుల సంఖ్య ఏడు కోట్లకు చేరుకుంటుందనీ, ప్రతి ఏడాది ప్రపంచవ్యాప్తంగా ఈ వ్యాధితో 15 లక్షల మంది మరణిస్తున్నారని తెలిపారు. అధిక బరువు, ఊబకాయం, హైబీపీ, ప్రెగ్నెన్సీలో షుగర్, కుటుంబ చరిత్ర, వ్యాయామం లేకపోవడం, కొవ్వు శాతం పెరగటం ఈ వ్యాధికి దారి తీస్తాయని చెప్పారు. ఈ వ్యాధిని సకాలంలో గుర్తించకపోయినా, చికిత్స అందించకపోయినా గుండె జబ్బులు, కంటి చూపు మందగించటం, పక్షపాతం, మూత్రపిండాలు దెబ్బతినటం, నరాల బలహీనత తదితర జటిలమైన సమస్యలు ఏర్పడతాయన్నారు.

ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ప్రజాసమస్యలపై పోరు ఉధృతం

- టిటిడిపి అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజాసమస్యలపై పోరాటాలను ఉధృతం చేయాలని తెలుగుదేశం తెలంగాణ విభాగం రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ భవన్‌లో ఆ పార్టీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అధికార ప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. వాడవాడలా, పల్లెపల్లెలో పసుపు జెండా ఎగిరేలా కృషి చేయాలని కోరారు. ఒక్కో నియోజక వర్గంలో 35వేల సభ్యత్వం లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలన్నారు. పార్టీలో చేరికలు ప్రోత్సహించాలనీ, ప్రజలకు మంచి చేయటమే లక్ష్యంగా ఉండాలని ఆదేశించారు.



స్కూలు ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

మధ్యాహ్న భోజన కార్మికుడి మృతి

- కులం పేరుతో దూషించారని మృతదేహంతో ఆందోళన
- ప్రిన్సిపల్, ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్
- కలెక్టర్ హామీతో ధర్నా విరమణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మధ్యాహ్న భోజన కార్మికున్ని కులం పేరుతో దూషించడమేగాకుండా వేధింపులకు గురిచేసి అతని ఆత్మహత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన వర్కర్ రాజునాయక్ మృతదేహాన్ని శనివారం మోడల్ స్కూల్ ముందు పెట్టి ధర్నా చేశారు. సుమారు నాలుగు గంటలపాటు రోడ్డుపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ భవేష్ మిశ్రా ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి..జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహముత్తారం మండలంలోని దొబ్బలపాడ్ మోడల్ స్కూల్‌లో రాజునాయక్ మధ్యాహ్న భోజన తయారీ వర్కర్‌గా పనిచేసేవాడు. ప్రిన్సిపల్ నాగరాజు, టీచర్లు సులోచన, ప్రభాకర్ అతన్ని కులం పేరుతో దూషించడంతోపాటు వేధించడంతో మనస్తాపానికి గురై రెండ్రోజుల కిందట పాఠశాలలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దాంతో కుటుంబ సభ్యులు, కులసంఘాలు, ప్రజాసంఘాల నాయకులు రాజునాయక్ మృతదేహంతో మోడల్ స్కూల్ ముందు కాటారం- మేడారం ప్రధాన రహదారిపై ఉంచి బైఠాయించారు. నిరుపేద కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో నాలుగు గంటలపాటు వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అజ్మీరా ఫుల్ సింగ్‌నాయక్, మాలభేరి రాష్ట్ర కన్వీనర్ పీక కిరణ్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్, బిఎస్‌పి నాయకులు మాట్లాడారు. ప్రిన్సిపల్ నాగరాజు, టీచర్లు సులోచన, ప్రభాకర్ వేధింపులతోపాటు కులం పేరుతో దూషించి అవమానించారని, అది తట్టుకోలేక ప్రిన్సిపల్ గదిలోనే రాజునాయక్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు.

రాజునాయక్ మృతికి కారకులైన వారిని సస్పెండ్ చేయాలని, బాధిత కుటుంబానికి మోడల్ స్కూల్‌లో ఉద్యోగం, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ధర్నా విరమించేది లేదని స్పష్టం చేయగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ప్రిన్సిపల్ నాగరాజు, ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఆదేశాలు జారీ చేశారు. కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో మాలభేరీ రాష్ట్ర కన్వీనర్ పీక కిరణ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్, తుడుండెబ్బ జిల్లా నాయకులు బచ్చల ఎర్రయ్య, బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల రాజయ్య, నాయకులు లింగమల్లు, దుర్గయ్య, భానోత్, కిషన్ నాయక్, జగన్ నాయక్, తాటి లచ్చయ్య, లింగమల్ల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగులకు మొబైల్ యాప్

- ప్రారంభించిన ఎమ్‌డి విసి సజ్జనార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఎస్ఆర్‌టిసి ఉద్యోగులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు వారికోసం ప్రత్యేకంగా 'ఎంప్లాయి ఎంగేజ్‌మెంట్' మొబైల్ యాప్‌ను రూపొందించినట్టు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు.ఆర్‌టిసిలోని పలు సేవలను డిజిటలైజ్ చేస్తున్నామనీ, దానిలో భాగంగా ఉద్యోగుల కోసం ప్రత్యేక యాప్‌ను వినియోగంలోకి తెస్తున్నామన్నారు. పైలట్ ప్రాజెక్టుగా తొలుత ఈ యాప్‌ను కంటోన్మెంట్, బర్కత్‌పురా, హైదరాబాద్-2 డిపోల్లో పరీక్షిస్తున్నామని తెలిపారు. శనివారం బస్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ యాప్‌ను ప్రారంభించారు. సంస్థలోని 44,764 ఉద్యోగులను కవర్ చేసేలా డిజిటల్ ప్లాట్‌ఫారంను రూపొందించామన్నారు. దీని ప్రధాన ఉద్దేశం ఉద్యోగులకు విధి నిర్వహణను మరింత సౌకర్యవంతం చేయడమేననీ, స్మార్ట్‌ఫోన్ ఉన్న ఉద్యోగులంతా ఈ యాప్‌ను వినియోగించుకోవచ్చన్నారు. రోజువారీ హాజరు, సెలవులు, పే స్లిప్‌లు, స్వంత సమాచారం, ఒకేసారి ఎక్కువ మంది ఉద్యోగులతో మీటింగ్స్, సర్క్యులర్‌లు, నోటిఫికేషన్లు, ట్రాకింగ్, ప్రభుత్వ నివేదికలన్నింటినీ ఒకేచోట అందుబాటులో ఉండేలా ఈ యాప్‌ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించామని స్పష్టం చేశారు.

ఉద్యోగుల సమస్యలపై చర్చిద్దాం

- గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఆయాచితం శ్రీధర్



ప్రజాశక్తి - కల్చరల్

అపరిష్కృతంగా ఉన్న గ్రంథాలయ ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ఈ నెల 14న రాష్ట్ర విద్యాశాఖ మంత్రితో చర్చించి పరిష్కారం దిశగా ప్రయత్నం చేద్దామని గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ ఆయాచితం శ్రీధర్ హామీ ఇచ్చారు. తాను కూడా పెన్షనర్‌నేనని ఆయన గుర్తు చేశారు. నగర కేంద్ర గ్రంథాలయం సమావేశ మందిరంలో తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల సంఘం సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. సంఘం అధ్యక్షుడు కె.దేవేందర్ అధ్యక్షత వహించిన సభలో ముఖ్య అతిథిగా శ్రీధర్ పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయ ఉద్యోగులకు జీతాలుగానీ, పెన్షన్లుగానీ 010 విధానంలో ప్రభుత్వ ట్రెజరీ నుంచి చెల్లింపు జరగాలన్న డిమాండ్‌ను సాధించి తీరుతామని తెలిపారు. ఉద్యోగ సంఘం నాయకుడు దేవీప్రసాద్ మాట్లాడుతూ పెన్షన్ ఉద్యోగుల హక్కు అన్నారు. ఈ హక్కును కేంద్ర ప్రభుత్వం తీసివేయడం దుర్మార్గమన్నారు. 010 పద్దు కింద గ్రంథాలయ ఉద్యోగులకు జీతాలు పెన్షన్ చెల్లింపు వల్ల ప్రభుత్వాన్ని ఇబ్బంది లేదని, కొందరు అధికారులు తప్పుడు సమాచారం వల్ల ఆలస్యం అవుతోందని ఆయన చెప్పారు. అధ్యక్షత వహించిన దేవేందర్ మాట్లాడుతూ పెన్షనర్స్‌కు హెల్త్‌కార్డులు, 010 పద్దు కింద పెన్షన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లో కోతలు పెట్టవద్దని కోరారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం కేంద్ర నాయకులు ప్రేమ్ కుమార్, నర్సన్న, కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ప్రసన్న రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్తు బకాయిలు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రజక, నాయీబ్రాహ్మణుల లాండ్రీ, సెలూన్ షాపులకు సంబంధించిన ఉచిత విద్యుత్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుమ్మడిరాజు నాగరాజు, పైళ్ల ఆశయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయమై ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావుని కలిసి విన్నవించామనీ, తాను స్పందించి వెంటనే విడుదల చేస్తామని ఇచ్చిన హామీ మేరకు రూ.12.88 కోట్ల నిధులను విడుదలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. బకాయిలు విడుదలపై వారు హర్షం వ్యక్తం చేస్తూ..ప్రభుత్వానికి దన్యవాదాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

పలువురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వేర్వేరు జిల్లాల్లో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు, ఒక యువతి మృతి చెందారు.

తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం గ్రామీణ మండలం కల్లంపాడు వద్ద కరీంనగర్ నుంచి భద్రాచలం వైపునకు వెళ్తున్న కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నందిత (16) మృతి చెందగా, కారు డ్రైవర్‌తోపాటు కారులో ఉన్న మరో ఐదుగురు గాయపడ్డారు. ఎస్ఐ వెంకటకృష్ణ ఘటనాస్థలికి చేరుకుని క్షతగ్రాతులను చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితులు హైదరాబాద్‌కు చెందిన.. గోళ్ల నందిత (16), కల్యాణి, మౌనిక, సుదీక్ష, కర్నూలుకు చెందిన కానాల శంకర్‌రెడ్డి, లక్ష్మి, కానాల వెంకటనారాయణరెడ్డి (కారుడ్రైవర్), కడపకు చెందిన పందిళ్లపల్లి యశస్విగా పోలీసులు గుర్తించారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కమలాపూర్ మండలం గుంటూరుపల్లికి చెందిన చుక్కా అజయ్(24), అన్నెం నాగార్జునరెడ్డి (32)తోపాటు మరో ముగ్గురు శనిగరం నుంచి నడికూడ మండలానికి కారులో వెళ్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ముందుగా వెళ్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకున్న కమాలాపూర్ సీఐ సంజీవ్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రులను వరంగల్ ఎంజిఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

భవిష్యత్ ఇంజినీరింగ్ విద్యదే..

- సబ్జెక్టుతోపాటు విషయ పరిజ్ఞానం ఉండాలి
- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భవిష్యత్ ఇంజినీరింగ్ విద్యకే అగ్రస్థానం లభిస్తుందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి అన్నారు. శనివారం నిర్మల్ జిల్లా బాసర ఆర్‌జియుకెటి యూనివర్సిటీలో విద్యార్థులతో ఆయన ముఖాముఖి మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో సబ్జెక్టుతోపాటు విషయ పరిజ్ఞానం ఉండాలన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్నదాని ఆధారంగా ప్రాక్టికల్స్‌లో పట్టు సాధించాలని తెలిపారు. లాబొరేటరీలో పరీక్షల ఆధారంగా మెరుగైన ప్రతిభ కనబరిచి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. సబ్జెక్టుపై సందేహాలను నివృత్తి చేసుకోవాలని, దీంతోపాటే ఇంగ్లీషు పరిజ్ఞానాన్ని కమ్యూనికేషన్ చేసుకోవాలని చెప్పారు. విద్యార్థులను ఇంటర్న్‌షిప్ అప్రెంటిస్‌వైపు ప్రోత్సహిస్తూ సహాయ సహకారాలు అందించాలని యూనివర్సిటీ అధికారులకు తెలియజేశారు. అనంతరం ఈకో టూరిజం పార్క్‌లో మొక్కలు నాటారు. అంతకుముందు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథికి యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ వెంకటరమణ, డైరెక్టర్ సతీష్ కుమార్, జిల్లా కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ, బైంసా ఏఎస్పీ కిరణ్ ఖరే స్వాగతం పలికారు.

సరస్వతి దేవి అమ్మవారిని దర్శించుకున్న ఎన్నికల కమిషనర్

సరస్వతి దేవి అమ్మవారిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అధికారులు, అర్చకులు మంగళ వాయిద్యాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలో పార్థసారథితో ప్రత్యేక కుంకుమార్చన పూజలు జరిపించి హారతినిచ్చి ఆశీర్వదించారు. ఈఓ విజయరామారావు ఎన్నికల కమిషనర్‌ను శాలువాతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

గిరిజనులపై నిర్బంధం తగదు

- తెలంగాణ గిరిజన సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిరిజనులకు ప్రధాని మోడీ ఇచ్చిన హామీలు అమలు చేయాలనీ, వారిపై నిర్బంధం తగదని తెలంగాణ గిరిజన సంఘం(టిజిఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రానికి ప్రధాని మోడీ వస్తున్న సందర్భంగా గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు, అడవుల ప్రయివేటీకరణను ఉపసంహరించుకోవాలనీ,పెరిగిన గిరిజన జనాభా నిష్పత్తి ప్రకారం 10శాతానికి రిజర్వేషన్లపెంపు, బయ్యారు ఉక్కు కర్మాగారం ఏర్పాటు తదితర డిమాండ్ల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమాలకు పిలుపునిస్తే దాన్ని పోలీసులు అప్రజాస్వామికంగా అడ్డుకున్నారని పేర్కొన్నారు. ఆ నిర్బంధాలను అధిగమించి హైదరాబాద్ నగరంతో పాటు అనేక జిల్లాల్లో నల్లబెలున్లను ఎగరేశారని తెలిపారు. శ్రీరాంనాయక్‌తో పాటు మరికొంత మందిని ముందస్తుగానే గృహనిర్బంధం చేశారని పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో గిరిజన సంఘాల జెఎసి నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారని తెలిపారు. నల్లగొండ, ఖమ్మం, మహబూబాబాద్ ,కొత్తగూడెం, సూర్యాపేట ,నాగర్ కర్నూల్, రంగారెడ్డి తదితర జిల్లా నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని పేర్కొన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నందకుమార్ హోటల్‌లో సిట్ తనిఖీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యేలకు ఎర కేసుకు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తును వేగవంతం చేసింది. ఇటీవలే ముగ్గురు నిందితులు రామచంద్రభారతి, సోమయాజి, నందకుమార్‌ను రెండు రోజులపాటు కస్టడీకి తీసుకుని ప్రశ్నించింది. విచారణ సందర్భంగా నిందితుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా శనివారం సాయంత్రం సిట్ అధికారులు.. నందకుమార్‌కు చెందిన ఫిలింనగర్‌లోని దక్కన్ హోటల్లో తనిఖీలు నిర్వహించారు.

రామచంద్రభారతి, సింహయాజి ఇదే హోటల్‌లో బస చేసినట్టు గుర్తించారు. సిసి కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలను సేకరించినట్టు సమాచారం. హోటల్‌కు నిందితులు ఎప్పుడు వచ్చారు? వారితో ఎవరెవరు వచ్చారు? ఎన్ని రోజులు బస చేశారు? అనే కోణంలో సిట్ అధికారులు దృష్టి సారించారు. ప్రధాన నిందితుడు రామచంద్రభారతి గత నెల 26న ఢిల్లీ నుంచి విమానంలో వచ్చినట్టు సిట్ అధికారుల దర్యాప్తులో తేలింది. రామచంద్రభారతితోపాటు ఢిల్లీ నుంచి ఇంకా ఎవరైనా వచ్చారా? అని ఆరా తీస్తున్నారు. పైలట్ రోహిత్‌రెడ్డికి రూ.100 కోట్లు, మిగతా ముగ్గురు ఎమ్మెల్యేలకు రూ.50 కోట్ల చొప్పున ఇస్తామని రామచంద్రభారతి చెప్పినట్టు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

మోడీ గోబ్యాక్

- ప్రధాని పర్యటన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు
- ముందస్తుగా నాయకుల అరెస్ట్



నల్లబెలూన్లతో నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెద్దపల్లి జిల్లాలోని రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సిఎల్) ప్రారంభోత్సవానికి వచ్చిన ప్రధాని రామగుండం పర్యటనను వ్యతిరేకిస్తూ కార్మిక క్షేత్రంలో, రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో నాయకులను ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు చేశారు. మోడీ పర్యటన సందర్భంగా భద్రత సమస్యలు తలెత్తేర్తని పోలీసులు రాజకీయ, కార్మిక సంఘాల నాయకులను శుక్రవారం రాత్రి, శనివారం ఉదయాన్నే ప్రధానంగా టిబిజికెఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి, హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అహ్మద్, ఐఎన్‌టియుసి నాయకులు ధర్మపురి, ఎస్.నర్సింహారెడ్డి, ఐఎఫ్‌టియు నాయకులు ఐ.క్రిష్ణ, ఇ.నరేష్, తోకల రమేష్, పౌర హక్కుల సంఘం నాయకులు మాదన కుమారస్వామి, బొడ్డుపెల్లి రవితోపాటు విద్యార్థి సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

ఖమ్మం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయా పార్టీ నాయకులను, పార్టీ ప్రజాసంఘాల నాయకులను శనివారం తెల్లవారుజామున అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. వారు మీడియాతో మాట్లాడుతూ.. అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదని, బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తామన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో పెవిలియన్ గ్రౌండ్ నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మతో భారీ ర్యాలీ నిర్వహించి దహనం చేశారు.

ఆసిఫాబాద్ జిల్లాలో సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్) నాయకులను తెల్లవారుజామునే అరెస్టు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జాక్ ఆధ్వర్యంలో ఫ్లకార్డ్‌లతో 'వేర్ ఈజ్ మై జాబ్ –గో బ్యాక్ మోడీ' అంటూ నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, నాయకులు లంక రాఘవులు, బండి దత్తాత్రిను ముందస్తుగా అరెస్ట్ చేశారు.

నిర్మల్‌లో గాంధీ పార్క్‌లో గాంధీ విగ్రహం ముందు నల్ల బెలూన్లు ఎగురవేసి నిరసన తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గద్వాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ సెంటర్లో జెండాలు పట్టుకొని నల్ల బ్యాడ్జీలు ధరించి మోడీ గో బ్యాక్ అంటూ ఫ్లకార్డ్స్ ప్రదర్శించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అన్ని మండల కేంద్రాల్లో వామపక్షాల నేతృత్వంలో పెద్దఎత్తున కార్మికులు రోడ్డెక్కి.. లేబర్ కోడ్‌తో తమ హక్కులను కాలరాస్తున్న మోడీ రాష్ట్రంలో అడుగు పెట్టొద్దని నినాదాలు చేశారు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నగరంలోని జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎన్ బాలమల్లేష్ ఆధ్వర్యంలో మోడీ గో బ్యాక్ అంటూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సంతోష్‌నగర్‌లో గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మనాయక్ పాల్గొన్నారు.

మెదక్ సంగారెడ్డి, సిద్దిపేట, గజ్వేల్, ములుగు, పటాన్‌చెరువు తదితర పట్టణాల్లో వామపక్షాలు, టిఆర్ఎస్, అనుబంధ సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. భువనగిరి జిల్లాకేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కోదాడ పట్టణంలో ప్రధాన రహదారిపై ప్రధానమంత్రి మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా వామపక్ష పార్టీల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్లకు తరలించారు.

మోడీ పర్యటనకు వ్యతిరేకంగా వెలిసిన ఫ్లెక్సీలు

ప్రధాని మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ ఈ ప్రాంతంలో ఫ్లెక్సీలు సైతం వెలిశాయి. తెలంగాణకు మోడీ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తూ గుర్తుతెలియని వ్యక్తులు భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఐటిఐఆర్ ఏర్పాటు ఎంతవరకు వచ్చిందని, టెక్స్‌టైల్ పార్కు ఏమైందని, మిషన్ భగీరథకు ఎన్ని నిధులు ఇచ్చారని, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఎక్కడికి పోయిందని, డిఫెన్స్ కారిడార్, బయ్యారం స్టీల్‌ప్లాంట్, మెడికల్ కాలేజీలు ఎన్ని ఇచ్చారని, పసుపు బోర్డు ఎప్పుడు ఏర్పాటు చేస్తారని, ఐఐఎం ఏమైందని ప్రశ్నల రూపంలో ఫ్లెక్సీల ద్వారా నిలదీస్తూ వీటిని ఏర్పాటు చేశారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

ఎన్‌టిపిసి కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. రామగుండం బి పాయింట్ వద్ద నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేశారు.

ఓయులో విద్యార్థుల అరెస్ట్

మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ ఓయులో పలువురు విద్యార్థులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేశారు. అయితే వారిని పోలీసులు అరెస్టు చేశారు.

తెలంగాణకు మోడీ వచ్చే నైతిక హక్కులేదు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

దేశ సంపదను పెట్టుబడిదారులకు అమ్మేస్తూ ఎనిమిదేండ్ల పాలనలో తెలంగాణ అభివృద్ధికి ఏమీ చేయని మోడీ రాష్ట్రానికి వచ్చే నైతిక హక్కు లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు.

మోడీ రాకను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని సుభాష్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. జూలకంటి మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడి ఎనిమిదేండ్లు అవుతున్నా కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ రాష్ట్ర విభజన హామీలను అమలు చేయకుండా.. రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. రామగుండానికి మోడీ రావడాన్ని తీవ్రంగా ఖండించారు. చండూరు మండలకేంద్రంలో టిఆర్ఎస్‌వి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి దిష్టిబొమ్మ దహనం చేశారు.

న్యూడెమోక్రసీ ఖండన

ప్రధాని మోడీ రాక సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఐఎఫ్‌టియు, ఇతర సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాధినేని వెంకటేశ్వర్‌రావు ఖండించారు.

వారిని వెంటనే విడుదల చేయాలని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

నిమ్స్ కాంట్రాక్టు కార్మికుల జీతాలను పెంచండి

- సీనియార్టీ ప్రకారం రెగ్యులరైజ్ చేయాలి
- సిఎం కెసిఆర్‌కు తమ్మినేని లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంట్రాక్టు కార్మికుల వేతనాల కోసం విడుదల చేసిన జిఒ నెంబర్ 306 (మునిసిపాలిటీ)ను సవరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. నిమ్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు జీతాలు పెంచాలని, వారి సీనియార్టీ ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు శనివారం ఆయన లేఖ రాశారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో సుమారు 1,350 మంది కార్మికులు కాంట్రాక్టు పద్ధతిలో గత 25 ఏండ్ల నుంచి పనిచేస్తున్నారని తెలిపారు. వారికి నెలకు రూ.14,700 జీతం ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇపిఎఫ్ మినహాయించగా వారి చేతికి రూ.12,900 వస్తాయని వివరించారు. ఆస్పత్రులు, నర్సింగ్‌హోమ్‌లు, క్లినిక్స్, డిస్పెన్సరీల్లో పనిచేస్తున్న కార్మికుల కోసం జిఒ నెంబర్ 306 (మునిసిపాలిటీ)ను కార్మిక శాఖ కమిషనర్ 2018 జులై 4న విడుదల చేశారని తెలిపారు. దాని ప్రకారం వారికి రూ.19 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం పెరిగే అవకాశమున్నా, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ గెజిట్ చేయలేదని పేర్కొన్నారు. అదే విధంగా సుమారు 25 ఏండ్ల నుంచి పనిచేస్తున్న కార్మికులకు, నాలుగేండ్ల నుంచి సర్వీసులో ఉన్న కార్మికులకు ఒకే విధమైన (రూ.14,700లు) జీతం ఇవ్వడం సరైందికాదని తెలిపారు. కాబట్టి సీనియార్టీని బట్టి జూనియర్లకు రూ.20 వేలు తగ్గకుండా, సీనియర్లకు వారి సీనియార్టీని బట్టి జీతం పెంచేలా ఈ మునిసిపాలిటీ జిఒను సవరించి, అమలు చేయాలని కోరారు. తెలంగాణ సాధించిన వెంటనే నిమ్స్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరిని రెగ్యులరైజ్ చేస్తామంటూ కేసీఆర్ హామీఇచ్చారని గుర్తు చేశారు. మంత్రులు కూడా నిమ్స్ ఆవరణలో సభపెట్టి కార్మికులకు న్యాయం చేస్తామంటూ వాగ్దానం చేశారని పేర్కొన్నారు. కార్మికులు ప్రభుత్వంపై అనేక ఆశలు పెట్టుకుని న్యాయం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. కాబట్టి నిమ్స్ ఆస్పత్రి కాంట్రాక్టు కార్మికులను సీనియార్టీ ప్రకారం రెగ్యులరైజ్ చేసి కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు.

పిఎఫ్ఆర్‌డిఎ చట్టాన్ని రద్దు చేయాలి

- నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలకు టిఎస్‌యుటిఎఫ్ ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పిఎఫ్ఆర్‌డిఎ) చట్టాన్ని రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. దేశవ్యాప్తంగా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరింది. జాతీయ పెన్షన్ పథకాన్ని అమలు జరుపుతున్న రాష్ట్ర ప్రభుత్వాలకు బయటకు వచ్చే స్వేచ్ఛ లేదంటూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. హైదరాబాద్‌లోని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి, ఎస్‌టిఎఫ్‌ఐ జాతీయ ఉపాధ్యక్షులు చావ రవి మాట్లాడుతూ ప్రపంచ షరతులకు లోబడి కార్పొరేట్ వ్యాపారుల షేర్ మార్కెట్‌లో ఫైనాన్స్ క్యాపిటల్‌గా పబ్లిక్ సొమ్మును వినియోగించుకోవటానికి చెందాలని కూడిన పెన్షన్ పథకాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్ ప్రయోజనాలు కాపాడటానికే నిర్మలా సీతారామన్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని చెప్పారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయ పెన్షన్ పథకాన్ని ప్రవేశపెడితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం దొడ్డిదారిన రాష్ట్రాల్లో ఎన్‌పిఎస్‌ను అమలు చేసేందని గుర్తుచేశారు. కుటుంబాల సామాజిక భద్రత పట్ల ఆందోళన చెందుతున్న సిపిఎస్ ఉద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు దేశవ్యాప్తంగా ఆ విధానానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాయని అన్నారు. ఆ క్రమంలో పాలక పక్షాలు రాజకీయ అస్తిత్వం కోసం ఉద్యోగులకు హామీలిస్తూ తలొంచక తప్పటం లేదన్నారు. ప్రజలకు చెందాల్సిన పెన్షన్ సొమ్ము ప్రభుత్వాలకు కాదంటూ వ్యాఖ్యానించిన కేంద్ర మంత్రికి నిజంగా ప్రజలపై ప్రేమ ఉంటే పిఎఫ్ఆర్‌డిఎ చట్టాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని, జనరల్ ప్రావిడెంట్ ఫండ్‌ను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. కనీసం పాత పెన్షన్ విధానంలోకి మారడానికి రాష్ట్రాలకు స్వేచ్ఛనివ్వడం ఆ చట్టాన్ని సవరించాలని కోరారు. జాతీయ విద్యావిధానం, జాతీయ పెన్షన్ పథకం రద్దు కోరుతూ ఎస్‌టిఎఫ్‌ఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న సంతకాల సేకరణలో రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మోడీకి పాలించే హక్కు లేదు

సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతికి అంకితం చేసిన ఆస్తులను కార్పొరేట్లకు అమ్ముకుంటున్న ప్రధాని మోడీకి దేశాన్ని పాలించే హక్కు లేదని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. నోట్లరద్దు పేరుతో ఆయన కొంతమంది వ్యాపార స్నేహితులకు ప్రయోజనం చేకూర్చారని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన విభజన హామీలను నెరవేర్చకుండా రాష్ట్రంలోకి అడుగుపెట్టే నైతిక హక్కులేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ "మోడీ గో బ్యాక్" అనే నినాదంతో హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్ నుంచి నాయకులు నల్ల చొక్కాలు ధరించి, నల్ల జెండాలతో ప్రదర్శనగా బయల్దేరారు. దీన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, సిపిఐ నాయకులకు మధ్య తోపులాట జరిగి ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఈ తోపులాటలో సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ ఛాయాదేవి కింద పడిపోవడంతో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి.

కె నారాయణ, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఈటి నరసింహతోపాటు పలువురు సిపిఐ, ఎఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ పోలీసులు సిపిఐ రాష్ట్ర కార్యాలయం లోపలికి వచ్చి కార్యకర్తలు వేసుకుంటున్న నల్ల చొక్కాలను లాక్కోవడం, బలవంతంగా అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. రాష్ట్ర పోలీసులు ప్రధాని మోడీ కోసం పనిచేస్తున్నారా? సిఎం కెసిఆర్ కోసం పనిచేస్తున్నారా? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయడం లేదని విమర్శించారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం వంటి అనేక ప్రాజెక్టులు ఏమయ్యాయని ప్రశ్నించారు. సింగరేణి బొగ్గు గనులను ప్రయివేట్‌పరం చేస్తే కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలను తీవ్రంగా అడ్డుకుంటామని హెచ్చరించారు.

హ్యుందాయ్ కార్లపై లక్ష వరకు తగ్గింపు

ముంబయి : ప్రముఖ కార్ల తయారీదారు హ్యుందాయ్ ఇండియా ఎంపిక చేసిన కొన్ని మోడళ్లపై తగ్గింపు ధరలను అందిస్తున్నట్లు ప్రకటించింది. ఆ కంపెనీ తొలి విద్యుత్ కారు కోనా ఎలక్ట్రిక్‌పై రూ.1 లక్ష వరకు డిస్కౌంట్ అందిస్తున్నట్లు తెలిపింది. గ్రాండ్ ఐ10 నియోస్‌పై రూ.35 వేలు, సిఎన్‌జి వేరియంట్ కారుపై రూ.25 వేలు తగ్గింపును ఇస్తున్నట్లు పేర్కొంది. ఎక్స్ఛేంజ్ బోనస్ రూపంలో రూ.10 వేలు, కార్పొరేట్ డిస్కౌంట్ రూ.3,000 వరకు లభించనుందని పేర్కొంది. ఈ వాహనాలపై గరిష్టంగా రూ.48 వేల వరకు డిస్కౌంట్‌లు పొందవచ్చని తెలిపింది.

కెనరా రోబెకో ఎంఎఫ్ నుంచి కొత్త ఫండ్

హైదరాబాద్ : అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలలో ఒకటైన కెనరా రోబెకో మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత సూచీల్లో ప్రధానంగా పెట్టుబడి పెట్టే ఓపెన్–ఎండ్ ఈక్విటీ స్కీమ్ అయిన కెనరా రోబెకో మిడ్ క్యాప్ ఫండ్‌ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. ఈ ఫండ్‌ను నవంబర్ 11న తెరవగా.. ఈ నెల 25న మూసివేయనున్నట్లు తెలిపింది. ఈ నిధులను నైతికత, బలమైన వద్ధి ఆధారిత వ్యాపారాలలో పెట్టుబడి పెట్టడం, సమర్థ నిర్వహణ, సహేతుకమైన వాల్యుయేషన్‌తో మిడ్‌క్యాప్ కంపెనీలలో పెట్టుబడి పెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆ సంస్థ ఎండి, సిఇఒ రజనీష్ నరులా తెలిపారు.

పిట్టీ ఇంజనీరింగ్ రెవెన్యూలో 26% వృద్ధి

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో పిట్టీ ఇంజనీరింగ్ నికర లాభాలు 22 శాతం తగ్గి రూ.10.15 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.13 కోట్ల లాభాలు ఆర్జించింది. క్రితం క్యూ2లో కంపెనీ నిర్వహణ రెవెన్యూ 25.57 శాతం పెరిగి రూ.304.17 కోట్లుగా నమోదయ్యింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.242.23 కోట్ల రెవెన్యూ ఆర్జించింది. గడిచిన త్రైమాసికంలో కంపెనీ సామర్థ్య వినియోగం 71.29 శాతంగా నమోదయ్యిందని తెలిపింది. 2022 సెప్టెంబర్ 30 నాటికి ఆర్డర్ బుక్ రూ.881 కోట్లుగా ఉందని ఆ కంపెనీ వైస్ ఛైర్మన్, ఎండి అక్షయ్ పిట్టీ పేర్కొన్నారు.

ప్రభుత్వంపై తప్పుడు విమర్శలు మానుకోవాలి

మంత్రి కొప్పుల ఈశ్వర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వంపై బిజెపి నేతలు తప్పుడు విమర్శలు మానుకోవాలని రాష్ట్ర ఎస్‌సి అభివృద్ధి మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సింగరేణి ప్రయివేటీకరణపై తప్పుడు ప్రకటన చేస్తున్నారంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను శనివారం ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. తెలంగాణకు న్యాయబద్ధంగా రావాల్సిన నిధులు, ప్రాజెక్టులకు సంబంధించి ప్రధానితో ఎందుకు ప్రకటన చేయించలేకపోతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. సిఎం కెసిఆర్ పాలనలోనే తెలంగాణ అభివృద్ధి చెందుతున్నదని తెలిపారు. వడ్లు కొనడం చేతకాని కేంద్ర ప్రభుత్వం అడ్డగోలు రాజకీయం చేస్తోందని విమర్శించారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు బిజెపి, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలవుతున్నాయా? అని ప్రశ్నించారు.

రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు ఓసారి ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. రైతు బంధు, రైతుబీమా, కాళేశ్వరం ప్రాజెక్టు, 24 గంటల కరెంటు తదితర పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు.

ధాన్యం తరలించాలని రాస్తారోకో

వర్షం వస్తే నష్టపోతామని రైతుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం తూకం వేసి వారం రోజులవుతున్నా.. రోజూ కాపలా కాయాల్సి వస్తుందని, తూకం వేసిన ధాన్యాన్ని సకాలంలో రైస్‌మిల్లుకు తరలించాలని రైతులు డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలోని కల్యాణి, రత్నాపూర్ గ్రామాల రైతులు తిమ్మారెడ్డి గేట్ వద్ద, అన్నసాగర్ గ్రామ రైతులు అన్నసాగర్ గేట్ వద్ద మెదక్–బాన్సువాడ ప్రధాన రహదారిపై శనివారం రాస్తారోకో చేపట్టారు. సొసైటీ అధికారులు సకాలంలో లారీలు పంపటం లేదని, వరి కుప్పలు వారం రోజుల నుంచి అలాగే ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను రైస్ మిల్లులకు తరలించడానికి తలకుమించిన భారం అవుతుందని వాపోయారు. రాత్రీపగలు వరి కుప్పలకు కాపలాగా ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతేడాదీ లారీల కొరత వేధిస్తున్నా సొసైటీ అధికారులు ముందస్తు ప్రణాళికలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం తరలించే వరకు ఆందోళన కొనసాగిస్తామని బైఠాయించారు. సమాచారం తెలుసుకున్న ఏసీఎస్‌వో వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకొని రైతులను సముదాయించారు. లారీలు పంపి ధాన్యం తరలిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



రహదారిపై బైఠాయించిన రైతులు

ధాన్యం కొనుగోలు చేయాలని రాస్తారోకో

సబ్‌మార్కెట్ యార్డులో ధాన్యం నిలువలు పేరుకుపోయాయని, వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ నల్లగొండ జిల్లాలో రైతులు రాస్తారోకో చేశారు. పెద్దవూర మండల కేంద్రంలోని సబ్‌మార్కెట్ యార్డు ముందు నాగార్జునసాగర్–హైదరాబాద్ జాతీయ రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. వాతావరణం సరిగా లేదని, వర్షం వస్తే ధాన్యం తడిసి ముద్దవుతుందన్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. 15 రోజుల నుంచి మార్కెట్ యార్డులోనే పడిగాపులు కాస్తున్నామన్నారు. ఇంతవరకు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐకెపి కేంద్రాలుగానీ, సహకార వ్యవసాయ పరపతి సంఘం ద్వారాగానీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారని ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు ఐక్యవేదిక నాయకులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో జీవనం ఎంతో సులభం

సిఐఐ సమావేశంలో మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చెన్నై, ముంబయి, కోల్‌కతా వంటి నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో జీవనం ఎంతో సులభమని తెలంగాణ ఐటీ, పురపాలకశాఖ మంత్రి కెటిఆర్ అన్నారు. భాగ్యనగరంలో మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపరిచేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) సదరన్ రీజనల్ కౌన్సిల్ సమావేశంలో మంత్రి కెటిఆర్ పాల్గొన్నారు. దక్షిణ భారతదేశంలో వ్యాపార సంబంధాలను బలపరిచే నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి ఆంధ్రా, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. 2014లో తెలంగాణ నుంచి రూ.57 వేల కోట్లు ఎగుమతులు ఉండేవని.. ప్రస్తుతం రూ.1.83 లక్షల కోట్లకు చేరాయని కెటిఆర్ తెలిపారు. భారీగా ఉత్పత్తి చేసే దేశాలైన చైనా, ఇండోనేషియా, మలేషియా వంటి దేశాలతో భారత్ ఎలా పోటీపడాలనే అంశంపై సిఐఐ సమగ్రంగా చర్చించాలని సూచించారు. "ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మా క్లస్టర్ హైదరాబాద్‌కు రాబోతోంది. ఇప్పటి వరకు ప్రపంచంలోనే అతిపెద్ద అమెజాన్ క్యాంపస్ హైదరాబాద్‌లోనే ఉంది. విప్రో, సేల్స్ ఫోర్స్, మెటా, ఉబర్ వంటి పెద్ద పెద్ద సంస్థల రెండో అతి పెద్ద క్యాంపస్‌లు కూడా ఇక్కడే ఉన్నాయి. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రానికి ఇది ఒక చిహ్నం. ఏరోస్పేస్ రంగంలో కూడా తెలంగాణ దూసుకెళ్తోంది. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిన హైదరాబాద్‌లో దేశంలోని ఏ ప్రాంతం నుంచి వచ్చిన వారైనా జీవించే సౌకర్యాలున్నాయి" అని మంత్రి కెటిఆర్ తెలిపారు.

వచ్చినోళ్లను వచ్చినట్టుగా అరెస్టు

- పోలీసుల దిగ్బంధనంలో ఆర్‌టిసి క్రాస్‌రోడ్
- ప్రధాని పర్యటన నేపథ్యంలో కార్మిక సంఘాల నేతల నిరసనలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు తలపెట్టిన 'మోడీ గో బ్యాక్' నిరసన కార్యక్రమాన్ని పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ఆర్‌టిసిక్రాస్‌రోడ్డు పరిసరాల్లో ఎటుచూసినా పోలీసులమయంగా కనిపించింది. అక్కడకు వచ్చిన కార్మిక సంఘాల నేతలను వచ్చినోళ్లను వచ్చినట్టుగానే పోలీసోళ్లు అరెస్టు చేశారు. పరిసర ప్రాంతాల్లో నడుచుకుంటూ వెళ్లేవారి విషయంలో కొంచెం అనుమానం వచ్చినా గుచ్చిగుచ్చి ప్రశ్నించారు. చెప్పినా వినకుండా పోలీసుస్టేషన్లకు పట్టుకెళ్లారు. పలువురు ముఖ్యనేతలు ఇళ్లు దాటకుండా చూశారు. సుదర్శన్ థియేటర్ నుంచి ఆర్‌టిసి క్రాస్‌రోడ్డువైపు బయలుదేరిన ఎఐటియుసి, సిఐటియు నేతలను తాళ్లతో చక్రబంధనం వేసి అడ్డుకున్నారు. నాయకులు రోడ్డుపైనే కూర్చోవడానికి యత్నించగా కాళ్లు, చేతులు పట్టుకుని మరీ ఎత్తుకెళ్లి వ్యాన్‌లోకి బలవంతంగా ఎక్కించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం సమీపం నుంచి ర్యాలీగా క్రాస్‌రోడ్డుకు వెళ్లేందుకు ప్రయత్నించిన టిఆర్ఎస్‌కెవి నేతలను అక్కడే అడ్డుకుని అరెస్టు చేశారు. పలు పోలీసుస్టేషన్లకు తరలించారు. వారిని సాయంత్రం ఐదున్నర తర్వాత సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో టిఆర్ఎస్‌కెవి రాష్ట్ర అధ్యక్షులు జి. రాంబాబు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు భూపాల్, ఎం. వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. కోటంరాజు, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్, తెలంగాణ మెడికల్ అండ్ సేల్ రిప్రజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజుభట్, సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్. వాణి, కుమారస్వామి, తదితరులున్నారు. అరెస్టయిన వారిని



ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ పరామర్శించారు. ముషీరాబాద్ పీఎస్ ఎదుట టిఆర్ఎస్‌కెవి రాష్ట్ర అధ్యక్షులు రాంబాబుయాదవ్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి భూపాల్, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్, తదితరులు మీడియాతో మాట్లాడుతూ..దేశ సంపదను కార్పొరేట్లకు మోడీ అప్పనంగా కట్టబెడుతున్నదని విమర్శించారు.

దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభాలుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు సంస్థలకు అమ్మేయడం దారుణమన్నారు. దేశభవిష్యత్‌కు ఇది తీవ్ర నష్టం చేకూరుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికుల హక్కులను మోడీ సర్కారు కాలరాస్తున్నదని విమర్శించారు. శాంతియుతంగా ఎక్కడికక్కడ నిరసనలు తెలపాలని తాము ప్రయత్నిస్తే అరెస్టు చేయడం అన్యాయమన్నారు. రామగుండం, గోదావరిఖని, సింగరేణి సంస్థ విస్తరించియున్న జిల్లాలతోపాటు తదితర ప్రాంతాల్లో నిరసన తెలుపుతున్న నాయకులను, కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్టులు చేశారన్నారు. అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టులను ప్రజా, కార్మిక సంఘాల నేతలు, మేధావులు, ప్రజాస్వామ్య వాదులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు.

సినీవర్కర్ల హౌసింగ్ సొసైటీ కమిటీని రద్దు చేయండి

సిఎం కెసిఆర్‌కు కూనంనేని లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సినీ వర్కర్స్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ (రిజిస్టర్ నెంబర్ టిబిసి 608- 1994) చిత్రపురి కాలనీలో ఇప్పటికీ తీవ్రమైన అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ఈ నేపథ్యంలో తక్షణమే ప్రస్తుత కమిటీని రద్దుచేసి సీనియర్ అధికారితో పిఐసిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు శనివారం ఆయన లేఖ రాశారు. 1994లో నాటి ప్రభుత్వం సినీ కార్మికుల కోసం మణికొండ జాగీర్‌లోని సర్వే నెంబర్ 246/1లో 67.16 ఎకరాల భూమిని జిఒ నెంబర్ 658 ద్వారా కేటాయించిందని గుర్తు చేశారు. సహకార సంఘాల చట్టం నిబంధనావళి ప్రకారం 4,213 ఫ్లాట్ల కోసం 4,800 మంది సభ్యులు ఉండాలని వివరించారు. కానీ దీనికి భిన్నంగా 2005–2022 సంవత్సరాలకు సంబంధించి సంఘ యాజమాన్యం 9,150 మందికి సభ్యత్వాలు ఇచ్చి అక్రమాలకు పాల్పడిందని విమర్శించారు. వాటిపై అనేక ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం యాక్ట్–51 విచారణ వేసి రూ.116 కోట్ల అక్రమాలు జరిగినట్టుగా ధ్రువీకరించిందని తెలిపారు. ఇప్పటికీ కొత్త సభ్యత్వాలు అక్రమంగా ఇస్తూ బ్లాక్ మార్కెట్‌లో సినీ కార్మికుల ఇండ్లు అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. రూ.200 కోట్ల విలువైన సినీ కార్మికుల భూమి 4.5 ఎకరాలు ప్రయివేట్ వ్యక్తులకు 24 శాతం వడ్డీకి తాకట్టు పెట్టి అప్పులు తెచ్చి, సర్వసభ్య సమావేశం తిరస్కరించినా కూడా సభ్యులపై రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల భారాలు మోపుతున్నా కో ఆపరేటివ్ అధికారులు స్పందించడంలేదని విమర్శించారు. సీనియర్ అధికారితో పిఐసిని ఏర్పాటు చేసి భవిష్యత్‌లో ఎలాంటి అక్రమాలు జరగకుండా చూడాలని కోరారు.

కొత్తగా వేయి మత్స్యకార సహకార సంఘాలు

మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొత్తగా వేయి మత్స్యకార సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. 650 మత్స్య సహకార సంఘాల్లో సభ్యులకు నైపుణ్య పరీక్షలు, మరో 334 సంఘాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. 650 మత్స్య సహకార సంఘాల్లో 13 వేల 900 మందికి సభ్యత్వం ఇచ్చినట్టు చెప్పారు. మూడు నెలల్లో ఈ సభ్యత్వ ప్రక్రియ పూర్తి చేయాలని మత్స్య శాఖ అధికారులను మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. 33 జిల్లాల్లో మత్ససహకార సంఘాల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. భవిష్యత్తులో మత్స్యకారుల అభివద్ధికి అవసరమైన పథకాలను రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలివ్వాలని అధికారులను ఆదేశించారు. ముదిరాజ్, యాదవ, కురమ సంఘ భవన నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ నిర్మాణాలు రెండు నెలల్లో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ సభ్యత్వ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు.